# పంట సిరి

"మొక్కజొన్న తోటలో... ముసిరిన చీకట్లలో... మంచెకాడ కలుసుకో... మరువకు మావయ్యా... నను..." మొక్కజొన్న చేను దగ్గర వేసిన మంచె మీద కూర్చుని రాగోలు హుషారుగా పాడుతున్నాడు.

మొలకపల్లి కోటేశ్వరరావు

పొద్దు కొండల్లో పడుతోంది. పక్షులు కిలకిలారావాలతో నివాసాలకు చేరుకుంటున్నాయి. వేలాది కొంగలు, రామచిలుకలు, గువ్వలు ఎగురుకుంటూపోతుంటే ఆకాశంలో హరివిల్లులా అద్భుతంగా, ఆహ్లాదకరంగా వుంది ప్రకృతి.

"ఏరోయ్ రాగోలూ... ఏంది యవారం? పైరాడతన్నావు! ఇంటికి రావెట్టా?" నెత్తిమీద చిన్న మేతమోపు పెట్టుకుని, గట్టున నడిచిపోతున్న పక్క చేను సుబ్బయ్య అడిగాడు.

"చేను వదిలి ఇంటికి రాబుద్ధి కావటం లేదు మామా! ఇక్కడే వుందామని పిస్తుంది!"

"ఉండరాదురా మరి! అడివి పందులు మొక్కజొన్న చేలన్నీ నాశనం చేసి వదిలి పెడతన్నయ్. నువ్వు గోల చేస్తంటే రాత్రిపూట అవి రాకుండా అయినా వుంటయ్ ఇంటికి పోయి ఎవురోకరికి బువ్వ పంపిస్తాంలే!"

"ఒయ్ మామా... ఏముంది మామా నా మొక్కజొన్న చేను. ఒక్కో కండె మూరెడు పొడుగున వచ్చింది. చూద్దామన్నా చిన్న సైజు కండె లేదు. అంతా ఏ క్లాసుగా వుందనుకో కండె!"

"నీదంతా ఏ క్లాసేలేరా! నీ బడాయికి తగ్గట్టుగానే ఇయ్యేడు నీపాటు అట్ట కుదిరింది. మేమేమో యిత్తుల్లో మునిగిపోతిమి. నీకేమో మంచి యిత్తులు దొరికె. ఏ కంపెనీ యిత్తుల్రా ఇయ్యి?"

"ఏమో మామా, నా కయ్యేం తెలవదు. మా బామ్మర్ది తెచ్చాడు యిత్తులూ, మేం నాటాం. రా మామా, చేను చూద్దువు. ఎన్ని కింటాల్లు అవతయ్యో, ఎట్ట వుందో"

"బాగానే వుందిలేరా, కనబట్టంలా! లోనికి వచ్చి చూడాలెట్టా? బాగానే అవతయ్యిలే మొక్కజొన్నలు. దబ్బు పోసుకుంటావులేరా!"

"మీ చేను ఎట్ట వుందేంది మామా?"

"ఏముంది? సగం కండెలో గింజ పోసుకుంటే, సగం గింజలేకుండా వుత్త కండె వుంది. ఏంచేద్దాం మనం, ఎంత ప్రాప్తమో అంత! ఇంతకీ నువ్వు ఇంటికి వస్తన్నావా, లేదా?"

"వస్తన్నా మామా! మొక్కజొన్న దంటు చివర్లు ఒక పన కోసా. గొడ్లకి ఒక మేతకన్నా వచ్చిద్దిగా. ఎత్తక వస్తన్నావుండు" అని రాగోలు చేను లోపలికి వెళ్ళాడు.

నెత్తిమీద మోపులతో ఇద్దరూ ఇంటిదారి పట్టారు.


మాట్లాడుకుంటూనే చేలగట్లుదాటి డొంక ఎక్కారు. డొంకలో ఇంకా కొంత మంది కలిసారు.

"మొక్కజొన్నలు ఎంత వుండొచ్చు మామా ఇయ్యేడు?"

"ఏమోరా ఎట్ట చెబదాం? నాలుగేళ్ళనాడు ఆరొందలు జేసి అమ్మేం. ఆ ధర ఇంకేం చూడబోతాం అనుకో! కనీసం ఐదువందలు వున్నా నష్టపోకుండా వుంటాంరా."

"మనం కొనేవాటి అన్నిటికీ ఒక యిత్తులేందీ, ఎరువులేందీ, మందులేందీ ఆకరికి కూలీనాలీ గూడా పెరిగిపోయె. మనకి పండి మనం అమ్ముకునే వాటి దగ్గరికి వచ్చేసరికి ధరలు దిగసారిపోతండె. కాలం ఇట్టావుంటే రైతు ఎం బతుకుతాడు మామా?" విచారంగా అన్నాడు రాగోలు.

"ముందు యేసిన వాళ్ళ పంట ఇంటికి వచ్చిందిగా. యేపారస్తులు నాల్రోజుల్లో కొనక పోతారా? చూద్దాం ఎంత చేసి కొంటారో!"



అన్నాడు సుబ్బయ్య.

మాట్లాడుకుంటూనే ఇంటికి చేరారు. సుబ్బయ్య, రాగోలు వాళ్ళ ఇళ్ళు కూడా దగ్గిర దగ్గిరగానే వుంటాయి.

**      **      **

నెలరోజులు జరిగిపోయాయి.

ముందుగా మొక్కజొన్న వేసుకున్నవాళ్ళకీ, వెనుక వేసుకున్నవాళ్ళకీ- అందరికీ పంట ఇంటికి చేరింది.

ఊళ్ళో ఎక్కడ చూసినా మొక్కజొన్న కండెల రాశులే. కొందరికి ఇళ్ళు పట్టక నడిరోడ్డు మీద సైతం రాశులు పోసుకున్నారు.

పొలం ఎక్కువ వుండి, వూళ్ళో పెద్దగా స్థలం లేనివాళ్ళు పొలాల్లోనే కండెలు విరగదీయించి అక్కడే కుప్పలు పోసుకున్నారు.

రోజులు జరిగిపోతున్నాయి. కానీ మొక్కజొన్నలు కావాలని అడిగిన నాథుడు లేడు.

పొలం దున్నీ, విత్తనం నాటుకునీ, ఎరువులు చల్లీ, స్వేదం చిందించీ, అప్పోసప్పో చేసి పెట్టుబడులు పెట్టీ, పంట పండించుకునీ- ఆ పంటని అమ్ముకుందామంటే కొనేవాళ్ళు ఎవరూ లేని పరిస్థితి దాపురించింది.

భృతి కోసం, తిండి కోసం, ఇతర అవసరాల కోసం రైతులు ఏడాది పొడుగునా చేసిన శ్రమఫలం, స్వేదఫలం, కష్టార్జితం అంతా పంటరూపంలో వుండటంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆ అన్నదాతలు విలవిలలాడిపోసాగారు.

కర్షక జనవాళిలో నిరసన, ఆగ్రహజ్వాలలు పెల్లుబుకిపోతున్నాయి.

కొనే వ్యాపారులు లేకపోవడంతో ప్రభుత్వం రంగప్రవేశం చేసింది.

కేంద్రప్రభుత్వం ఎఫ్‌సిఐనీ, రాష్ట్రప్రభుత్వం మార్క్‌ఫెడ్‌నీ రంగంలోనికి దించాయి.

ప్రభుత్వం మొక్కజొన్నలకి మద్దతుధర 445 రూపాయలుగా నిర్ణయించింది. అదే ధరకి ఆ రెండు సంస్థలూ రైతులవద్దనించి కొనుగోలు చేయడానికి సంసిద్ధత తెలిపి సన్నాహాలు ప్రారంభించాయి.

రైతులు తమ సరుకుని మార్కెటింగ్ యార్డులకి తెచ్చుకొమ్మని గ్రామాల్లో దండోరా వేయించారు.

పొద్దున్నే ఇంటిముందు కూర్చుని మొక్కజొన్న పీచుతో మంట వేసుకుని చలికాచుకుంటున్నాడు సుబ్బయ్య. నోట్లో వేపపుల్ల పెట్టుకుని పళ్ళు తోముకుంటూ రాగోలు వచ్చి తనూ మంట దగ్గర కూర్చుని అన్నాడు.

"ఏం మామా... సందకాడ యిన్నావా తప్పెట? యార్డుకి తీసకపోతే 445 చేసి కొంటారంటగా మొక్కజొన్నలు"

"పోనీయిలే, ఎంతో కొంత చేసి కొంటన్నారు. అదే పదివేలు!"

"తీసకపోదాం మరి?"

"యార్డుకి తీసకపోతే కర్చులు చాలా అవతయ్యిరా. గోతాలూ, బాడుగలూ, ఎత్తుళ్ళూ, దింపుళ్ళూ తడిసి మోపెడయిద్ది. అంతకాడికి వూళ్ళ యేపారస్తులు కొంటే ఎంతో కొంతచేసి ఇక్కడ్నే అమ్ముకోటం నయంరా"

"మనూరి యేపారస్తుల మాట చెప్పు. పాపం పుణ్ణెం లేదు. చిక్కినోడి దగ్గిర చిక్కినట్టు కాజేస్తారు. వీళ్ళకి నేనసలు ఇయ్యను మామా! యార్డుకే తీసకపోతా" అన్నాడు రాగోలు.

"తొందరపడకు. చూద్దాం. ముందు అసలు యార్డులో శాంపుల్ గింజలు తీసకపోయి చూపెట్టాలంటగా."

"చూపెడదాం. ఏం అయిద్దేంది? మనయ్య పదవా?"


తరువాత రెండురోజులకి వూళ్ళ వ్యాపారులు 350 మీద కొనుగోళ్ళు మొదలుపెట్టారు.

ఎక్కడో దూరంలో ఏదో వూళ్ళో యార్డుకి తీసకపోయి ఎక్కడ ఇబ్బంది పడతాం అనే భావంతో కొందరు వూళ్ళోని వ్యాపారులకి అమ్ముకోవడం మొదలుపెట్టారు.

రాగోలు పదికండెలు మంచివి ఏరుకుని, గింజలు తీసి, శాంపుల్ చూపెడదామని యార్డుకి తీసుకుపోయాడు.

అప్పటికి కొనుగోళ్ళు చేస్తామని చెప్పి పదిరోజులు అయింది. ఒక్క రైతు దగ్గర ఒక్క క్వింటాల్ కూడా అప్పటికి కొనుగోలు చేయలేదు.

"నాది చాలా బాగుందండీ సరుకు. యాభై కింటాళ్ళు అవతయ్. తీసుకుర




మ్మంటారా?" ఆఫీసులో వున్న బయర్‌కి తను తెచ్చిన గింజలు చూపెట్టి అడిగాడు రాగోలు.

"బాగా ఎండబెట్టుకుని తీసుకురండి. గింజల్లో తేమ 14 శాతం లోపు వుండాలి. నల్లగింజ అనేది వుండకూడదు. తాలూ, పొట్టు కూడా వుండకూడదు. చిన్న గింజలు వుంటే జల్లెడలు వేయాల్సి వుంటుంది. మీరు సరుకు తెస్తే అదేరోజున చెక్ ఇస్తాం బ్యాంక్ దగ్గరికి తీసుకుపోతే వెంటనే క్యాష్ ఇస్తారు" చెప్పాడు బయర్.

ఊళ్ళో వ్యాపారులకి సరుకు వేస్తే, డబ్బు ఇవ్వడానికి రేపూ మాపూ అంటూ తిప్పించుకుని బాగా ఇబ్బందిపెడతారు. ఒక్కసారిగా, ఒక్కపద్దుగా ఇవ్వరు. అప్పుడు కొద్దిగా, అప్పుడు కొద్దిగా దశలవారీగా ఇస్తారు. అవి ఒక అక్కరకి రావు. తుకాల్లోనూ మోసం చేస్తారు. ఈ బాధలు లేకుండా డబ్బు కూడా వెంటనే వస్తుంది కాబట్టి, యార్డుకే తీసుకుపోదామని గట్టిగా నిర్ణయించుకున్నాడు రాగోలు.

ఇంటికి వెళ్ళిన వెంటనే ట్రాక్టర్ వాళ్ళకి చెప్పి కండెలు గింజలు పట్టించాడు.

"ఏరా రాగోలూ... అయితే యార్డుకే తీసకపోతావా?" అడిగాడు సుబ్బయ్య ఆశ్చర్యంగా.

"నీ అసుంటి పిరికోడ్ని కాదు మామా నేను! తీసకపోకుండా వూళ్ళో యేపారులకి ఇస్తానా ఏంది? 445 ఎక్కడా, 350 ఎక్కడా? పైన 45 కర్చులికి పోయినా కింటాకి 50 రూపాయల తేడా వుంది. ఎట్టనుకున్నా నాయ్యి 50 కింటాళ్ళు అవతయ్యి! కింటాకి 50 రూపాయలు అయితే 50 కింటాళ్ళకీ పాతికవందలు! చూస్తా చూస్తా వీళ్ళ ముకాన పాతికవందలు ఎందుకు పొయ్యాలి? నీ అసుంటోళ్ళు వుండబట్టే యేపారులు డాబాల మీన డాబాలు కట్టిచ్చడం. మనం కుంగిపోవటం."

"పెద్ద నాణ్ణెగాడివి బయలుదేరావు లేరా. అందరికీనీ అంత తెలివి లేకనే - వూళ్ళో అమ్ముకోటం. యార్డుకి తీసకపోతే నానా ఇబ్బంది పెడతారా. కుక్కచావు చావాలి. ఎందుకు వచ్చిన బాధ" అన్నాడు సుబ్బయ్య.

"చూద్దాం కానీయ్" అన్నాడు రాగోలు.

పట్టించిన మొక్కజొన్నల్ని వారంరోజులు ఎండబెట్టాడు. గింజ బాగా ఎండిందనుకున్న తరవాత ట్రాక్టర్‌కి వేసుకుని యార్డుకి తీసుకుపోయాడు.

యార్డులోని సిబ్బంది తన మొక్కజొన్నలు మొత్తం బస్తాల్లోనించి కార్చి రాశిగా పోయించారు.

పక్కన ఇంకో మూడు రాశులు వున్నాయి. అంటే ఇంకో ముగ్గురు రైతులు తెచ్చారన్నమాట. ఒకరాశి మీద ఒక రైతు దిగాలుపడి కూర్చునివున్నాడు.

ఎఫ్‌సిఐ సెలక్టర్ వచ్చాడు. రాశిని పట్టి చూసాడు.

"గింజలో పొట్టు బాగా వుంది. తూర్పార పట్టాలి. సన్నగింజ కనబడతందీ, బెండ్లు కనబడతన్నయ్. రెండు జల్లెడలు వేయాలి"

"మొక్కజొన్నలు అంటే పొట్టూ, బెళ్ళూ లేకుండా ఎట్ట వుంటయ్ సామీ?" అడిగాడు రాగోలు.

"అవి వుంటే మాకు పడవు. మా ప్రమాణాలకి లోబడి వుంటేనే మేం కొనగలం. పంట మీ ఇష్టం వచ్చినట్లు తెచ్చి కొనమంటే మాకు ఎలా వీలవుతుంది?"

"ఇంటి దగ్గర బాగా చేసుకొచ్చానండీ. ఇంతమాత్రం ఎవరూ చేయరు"

"వాదన వద్దు. ఎవరికి వాళ్ళు అలాగే అనుకుంటారు. చెప్పిన పని చేయండి."

నిష్కర్షగా అన్నాడు సెలక్టర్.

ముఠాకూలీలు వచ్చారు. "కింటాకి తూర్పుర పట్టినందుకు 15 రూపాయలూ, రెండు జల్లెడలు వేసినందుకు 20 రూపాయలూ. పనిలోకి దిగమంటావా మరి?" అడిగాడు మేస్త్రీ.

"కానివ్వండి మరి. తప్పేదేముంది?" అన్నాడు రాగోలు దిగాలుపడుతూ.

"ఎంత తప్పు పని చేసా్నా దేవుడా? ఊళ్ళో అమ్ముకుని వుంటే ఈ గతిపట్టేది కాదుగదా! ఇప్పటికైనా అయిందా? ఇంకా ఎన్నిరోజులు పడిగాపులు కాయాలో, ఎప్పుడు కొంటారో, ఇంకా ఎన్ని తంటాలు పడాలో" అని డీలా పడిపోయాడు రాగోలు.

సాయంత్రానికి కూలీలు రెండు జల్లెడలు వేసి, తూర్పారపట్టారు.

మరుసటి రోజు సెలక్టర్ రాలేదు. తరువాత రోజు వచ్చాడు.

"రాశిలో అక్కడక్కడా నల్లగింజ కనబడతంది. కూలీల్ని పెట్టి నల్లగింజ ఏరించండి. నాలుగు నల్లగింజలు వున్నా చాలు, మొత్తం మొక్కజొన్నలు చెడిపోతాయి" చెప్పాడు సెలక్టర్.

తప్పేదేముంది?

మరుసటిరోజు యార్డు వున్న వూళ్ళోకి పోయి, ఎనిమిదిమంది కూలీల్ని పిలుచుకువచ్చి రాశిలో నల్లగింజ ఒక్కటి-కూడా లేకుండా మొత్తం ఏరించాడు.

తరువాత సెలక్టర్ రెండు రోజులు రాలేదు. ఆయన జిల్లా కేంద్రం నించి రావాలి.

అప్పటికి రాగోలు యార్డుకి వచ్చి వారం రోజులు అయింది. అక్కడ పరిచివున్న నాపరాళ్ళమీదనే పడక! స్నానం లేదు. హోటల్లో భోజనం చేస్తున్నాడు. డిసెంబర్ నెల. చలికి గజగజలాడిపోతున్నాడు. ఇక బట్టలవిషయం చెప్పేపనిలేదు. మురికిపట్టిపోయాయి.

వారంలో మధ్యలో ఒకసారి ఇంటికి వెళ్ళాడు.

"ఇదేంది ఈ అవతారం? ఆ గుడ్డలేందీ? నాలుగురోజులకే నువ్వు ఇట్ట అయిపోయావు" అంది భార్య విస్తుపోతూ.

రాగోలు ఏం జవాబు చెప్పలేదు.

"ఊళ్ళోనే అమ్ముకుంటే పోయేది గదయ్యా?" అంది ఆమె. మౌనమే రాగోలు జవాబు.

నీళ్ళు సలసలా మరగబెట్టి తలంటుపోసింది భర్తకి.

"అది గాదయ్యా... నువ్వు పోయి అక్కడ కూర్చుంటే ఎట్ట? ఇక్కడ గొడ్డూ గోదాని ఎవురు సముదాయిస్తారు? శనగ చేలో పురుగు ఏం పడినా పడింది. ఇప్పుడు మందు యేసుకోకపోతే శనగయిత్తు ఇంటికి రాదు. దివాల ఎత్తిపోవాల్సిందే" అంది ఆమె.

రాగోలు వెళ్ళి చూస్తే చేల్లో పురుగు యెక్కువగా వుంది.

యార్డులో గింజలు కుప్పపోసి వున్నాయి. పండిన పంట. దిక్కూదివాణం లేదు.

ఇక్కడ మందు వేసుకోవాలా? అక్కడ గింజ దగ్గర వుండాలా?

"ఎంత తప్పు పని చేసా్నా దేవుడా? ఊళ్ళో అమ్ముకుని వుంటే ఈ గతిపట్టేది కాదుగదా! ఇప్పటికైనా అయిందా? ఇంకా ఎన్నిరోజులు పడిగాపులు కాయాలో, ఎప్పుడు కొంటారో, ఇంకా ఎన్ని తంటాలు పడాలో" అని డీలా పడిపోయాడు రాగోలు.

తనతోపాటు మరో ముగ్గురు రైతులు- వాళ్ళూ తనలానే యాతన పడుతున్నారు. వాళ్ళలో ఒకతను అన్నాడు.

"వీళ్ళు రైతుల్ని పొమ్మనకుండా పొగపెడతన్నారు. యార్డులో సక్రమంగా కొంటే రోజుకి లక్ష కింటాళ్ళు రాకపోయినయ్యా? దేశంలో పొగాకు కూడా లేకపోయేసరికి ఎక్కడ చూసినా ఇదే పంటాయె. వీళ్ళు ముప్పయ్ మూడు వంకలు చెప్పి, అరవై ఆరు చెరువుల నీళ్ళు తాపుతుంటేనే ఎవురూ తీసుకురానిది"

నిజమే అనిపించింది రాగోలుకి.

సెలక్టర్ వచ్చాడు. మళ్ళీ చూసాడు. "చలికాలం కదా. ఎండలు బాగా కాయడం లేదు. సాయంత్రానికి గింజ మెత్తబడిపోతున్నది. కనీసం ఇంకా నాలుగు ఎండలైనా ఎండాల్సిందే. గింజలో ఇరవై శాతం దాకా తేమ కనపడుతున్నది" అన్నాడు.

ఇంకా నాలుగురోజులు వుండాలన్నమాట. రాగోలు గుండెల్లో రాయి పడింది. తట్టుకుని నిలబడ్డాడు.

• ఆ రోజు మధ్యాహ్నం ఒకరూ, మరో రెండు గంటల తరువాత ఇంకొకరూ మోటారు సైకిళ్ళు వేసుకుని వచ్చారు. వాళ్ళ వెంట రెండు లారీల మొక్కజొన్నలు కూడా వచ్చాయి. వాళ్ళు తెచ్చిన మొక్కజొన్నలు వెంటనే పాస్ అయ్యాయి.

వాళ్ళు వ్యాపారులు! గ్రామాల్లో 350 మీద కొన్నవాళ్ళు. రైతులో, కూలీలో ఎవర్నో వెంట తెచ్చుకుని వాళ్ళ పేరు మీద అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.

"అదేందండీ, వాళ్ళ సరుకుని అంత తొందరగా కొనడం ఏందీ, మమ్మల్ని ఇట్ట అల్లాడిచ్చడం ఏందీ?" రాగోలు అడిగాడు.

"మిమ్మల్ని మేం అల్లాడిస్తున్నామా? వాళ్ళు తెచ్చిన సరుకు ఎలా వుందీ, మీ సరుకు ఎలా వుందీ? వాళ్ళు మాకు బంధువులా? సరుకు బాగుండటమే మాకు కావాల్సింది" అన్నాడు సెలక్టర్.

వాళ్ళు కావాలనే, రైతుల్ని యార్డువైపు రానివ్వకుండా చెయ్యాలనే వుద్దేశంతోనే ముప్పుతిప్పలు పెడుతున్నారని అక్కడ పడిగాపులు పడుతున్న రైతులకి అర్థమైపోయింది.

రాగోలు తెచ్చిన మొక్కజొన్నలు 15వ రోజుకి పాస్ అయ్యాయి. అదేరోజు వాళ్ళ వూరునించి ఒక వ్యాపార్తి తెచ్చిన లారీ సరుకు క్షణాల మీదనే కొనుగోలు చేసారు.

యార్డువాళ్ళని తిట్టుకుంటూ రాగోలు ఇంటికి చేరుకున్నాడు. లెక్క చూసుకుంటే వూళ్ళో అమ్ముకోవడమే లాభంగా కనిపించింది.

"ఏరోయ్ రాగోలూ... కనబడటం లేదు యాడికి పోయావురా? కోస్తామీదకి యేపారానికి గానీ పోయావెట్టా?" సుబ్బయ్య నవ్వుతూ పరిహాసంగా అడిగాడు.

"నీ పని అట్టవుంది మామా. పండిన పంట వూళ్ళోనే అమ్ముకుంటివీ. నేనేమొ గవరమెంటుకి అమ్ముదామని పోయి బోల్తా పడితిని. ఇయ్యాల నువ్వు ఏమైనా అంటావు"

"యార్డులో యవారం ఎందిరా?"

"అక్కడ అంతా యేపారుల రాజ్జెమే. యేపారులూ వాళ్ళూ కుమ్మక్కు అయ్యారు. యేపారులు సరుకు తీసకపోటమే ఆలస్యం కొంటన్నారు. మనం తీసకపోతే మాత్రం నానా ఇబ్బంది పెడతన్నారు."

"అంతేరా, ఇయ్యాలేం కొత్తా? పత్తీ, పొగాకు, యేరుశనగా, ధాన్యం, మిరపా ఏదయినా సరే పండించడం వరకే మన పని. ఫలితం అనుభవించేది వాళ్ళే. రైతుల మీద యేపారం చేసేవోడు ఒక్కోడు ఎంత సంపాయిస్తన్నాడో చూడు. పంటే మనది, సిరి వాళ్ళదే"

"ఛత్... రైతు బతుకు నీచపు బతుకు అయిపోయింది మామా. పండించుకుని కూడా ఏం వుపయోగం? పెట్టిన కర్చులు రాలా" అన్నాడు రాగోలు- ఎవరి మీదనో తెలీని నిరసనతోనూ, ఆగ్రహంగానూ, బాధగానూ. ●